10 YEAR ANNIVERSARY 2014 - 2024

# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

బుధవారం | 5 మార్చి 2025 | పేజీలు 8

# ప్రముఖ సింగర్ కల్పన ఆత్మహత్యాయత్నం

- హైదరాబాద్ నిజాంపేటలో ఉంటున్న సింగర్ కల్పన
- నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం
- తలుపులు బద్దలు కొట్టి కాపాడిన పోలీసులు



**హైదరాబాద్ పెన్ పవర్:** కేపీహెచ్‌బీ కాలనీ (హైదరాబాద్): ప్రముఖ గాయని కల్పన ఆత్మహత్యాయత్నం చేశారు. నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు సమాచారం. హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో ఆమె చికిత్స పొందుతున్నారు. ఆత్మహత్యాయత్నానికి కారణం మాత్రం ఇంకా తెలియరాలేదు. కల్పన నిజాంపేటలోని వర్టెక్స్ ప్రీ వీలేజ్

-2 లో

# వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వండి..

## సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఆదేశాలు



**హైదరాబాద్ పెన్ పవర్:**సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ –చివ్వెంల మండలం ఐలాపురం ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సీయల్ కళాశాల, పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల.. నిర్వహణ 10 వతరగతి.. ఇంటర్ విద్యార్థులకు చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. టీచర్ల హాజరు పట్టీ... వంట గదిలోని.. స్టాక్ రిజిస్టర్ ను పరిశీలించారు. విద్యార్థులకు మెను ప్రకారం విద్యార్థినిలకు భోజనం ఇవ్వాలని సిబ్బంది కి సూచించారు. పాఠశాల లో విద్యార్థులకు ఇస్తున్న వసతులపై ఆరా తీశారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను ఏర్పాటు చేయాల్నారు. వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ప్రోత్సహించాలంటూ... జిల్లాలో ఉత్తీర్ణత శాతం పెంచాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.



# భారత్ ఉత్పత్తిదారుల దేశంగా ఉండాలి.. పెట్టుబడిదారుల దేశంగా కాదు

- దేశంలో కార్పొరేట్ రాజ్యం
- ప్రజలపై భారీగా పన్నుల భారం
- అభివృద్ధికి పాలకులు కృషి చేయాలి
- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్
- నాంపల్లిలో ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక 30వ వార్షికోత్సవం

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రజాస్వామ్యంలో ఎవరైనా తమ సమస్యలపై ప్రభుత్వాలను, పాలకులను ప్రశ్నించే హక్కు ఉందని.. ఇందుకోసం ప్రత్యేక అనుమతులు అవసరం లేదని తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ అన్నారు. మంగళవారం (మార్చి 4) హైద్రాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ప్రజా ఉద్యమాల జాతీయ

-2 లో

# హైదరాబాద్‌లో రౌడీ షీటర్ అలీ బీన్ మహమూద్ జబ్రీ అరెస్ట్



**హైదరాబాద్ పెన్ పవర్:** రౌడీ షీటర్ అలీ బీన్ మహమూద్ జబ్రీ (32)ని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎన్నో కేసుల్లో నిందితుడిగా ఉన్న మహమూద్ జబ్రీ.. చాలా కాలంగా పరారీలో ఉన్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం (మార్చి 4) పక్కా ప్లాన్ ప్రకారం టాస్క్‌ఫోర్స్, సౌత్ ఈస్ట్ జోన్ బృందం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. బండ్లగూడలోని ఇస్మాయిల్ నగర్‌కు చెందిన అలీ బీన్ మహమూద్ జబ్రీ ఫోర్జరీ, హత్యాయత్నం వంటి అనేక కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. హైదరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో భూ కబ్జా, మోసం, ఫోర్జరీ, క్రిమినల్ బెదిరింపులు, హత్యాయత్నంతో సహా 21 కేసుల్లో అతని ప్రమేయం ఉన్నట్లు సమాచారం. బండ్లగూడ, చంద్రాయణగుట్ట, కామాటిపుర, పహాడిషరీఫ్ పోలీస్ స్టేషన్లలో అతడిపై కేసులు కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు మహమూద్ జబ్రీపై పోలీసులు రౌడీ షీట్ ఓపెన్ చేశారు. పలు కేసుల్లో మహమూద్ జబ్రీ జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చాడు. బెయిల్ మీద బయట ఉన్న జబ్రీ

-2లో

## భారత్ ఉత్పత్తిదారుల దేశంగా ఉండాలి.. పెట్టుబడిదారుల దేశంగా కాదు

- మొదటి పేజి తరువాయి
వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ మహా సభలకు మీనాక్షి నటరాజన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పర్యావరణ ఉద్యమకారురాలు మేధాపాట్కర్ లాంటి వారు మూసీ నది పరివాహక ప్రాంతంలో పర్యటించడానికి వెళ్తే పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు అలా అడ్డుకోవడం సరికాదు. ప్రజాస్వామ్యంలో ప్రజలతో మాట్లాడే హక్కు ప్రతి ఒక్కరికి ఉందన్నారు. ఉద్యమాల్లో నేను మేధా పాట్కర్ లాంటి వారి నుంచి స్ఫూర్తి పొంది ప్రజా ఉద్యమాలు, రాజకీయాల్లోకి వచ్చి పని చేస్తున్నానని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికి ప్రశ్నలు లేవనేత్తే హక్కులు ఉన్నాయన్నారు. ప్రస్తుతం దేశంలో కార్పొరేట్ వ్యవస్థ రాజ్యమేలుతోందని.. కానీ గాంధీ కోరుకున్న దేశంగా భారత్ ఉండాలని ఆమె ఆకాంక్షించారు. భారత్ ఉత్పత్తిదారుల దేశంగా ఉండాలి కానీ.. ప్రస్తుతం పెట్టుబడిదారుల దేశంగా ఉందని.. ఈ పద్ధతి మారాలని అన్నారు. అందుకోసం నేను కాంగ్రెస్ పార్టీ తరుపున కృషి చేస్తానన్నారు. దేశంలో కోటీశ్వరుడు, సామాన్యులు ఒకే టాక్స్ కడుతున్నారు. అంబానీ, అదానీ, చివరకు పాల పాకెట్ కొనుకునే సామాన్యులు సమానంగా టాక్స్‌లు కడుతున్నారు.. ఈ విధానాలు మారాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వాలు పరిమితమైన అధికారులతో ఎన్నుకున్నారు.. కానీ ప్రభుత్వాలు రాజులుగా వ్యవహరించకూడదని సూచించారు.

## హైదరాబాద్‌లో రౌడీ షీటర్ అలీ బిన్ మహమూద్ జబ్రీ అరెస్ట్

- మొదటి పేజి తరువాయి
గత కొంతకాలంగా కోర్టు విచారణకు హాజరుకాకుండా పోలీసుల కళ్లగప్పి తిరుగుతున్నాడు. దీంతో కోర్టు జబ్రీ బెయిల్ రద్దు చేసి నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. పరారీలో ఉన్న జబ్రీపై పోలీసుల ఫోకస్ పెట్టారు. ఈ క్రమంలోనే మంగళవారం (మార్చి 4) పక్కా వ్యూహం ప్రకారం టాస్క్ ఫోర్స్, సౌత్ ఈస్ట్ జోన్ బృందం పోలీసులు జబ్రీని అరెస్ట్ చేసి ఆట కట్టించారు.

## ప్రముఖ సింగర్ కల్పన ఆత్మహత్యాయత్నం

- మొదటి పేజి తరువాయి
గేటెడ్ కమ్యూనిటీలో నివసిస్తున్నారు. రెండు రోజులుగా వారి ఇంటి తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చిన సెక్యూరిటీ సిబ్బంది.. అసోసియేషన్‌కు సమాచారం ఇచ్చారు. అసోసియేషన్ సభ్యులు ఆమెతో మాట్లాడేందుకు ఫోన్ చేయగా స్పందించలేదు. దీంతో, ఆమె భర్తకు కాల్ చేసి విషయం చెప్పారు. ఆయన కూడా కల్పనతో మాట్లాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అసోసియేషన్ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇంటికి చేరుకున్న పెట్రోలింగ్ పోలీసులు తలుపులు పగులకొట్టారు. ఇంట్లో కల్పన అచేతన స్థితిలో ఉండటంతో సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కల్పన భర్త చెన్నై నుంచి ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. ప్రస్తుతం కల్పనకు వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. సింగర్ శ్రీకృష్ణ, గాయని సునీత, గీతామాధురి, కారుణ్య ఆస్పత్రికి వచ్చి కల్పన ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు.

# ఎస్ఎల్బీసీ టన్నెల్ సహాయక చర్యలు స్పీడప్.. గంటకు 800 టన్నుల మట్టి బయటికి డంపింగ్‌లి



హైదరాబాద్ పెన్ పవర్:ఎస్ఎల్బీసీ టన్నెల్ లో సహాయక చర్యలు మరింత వేగవంతం అయ్యాయి. ప్రమాదానికి గురైన టన్నెల్ కన్వేయర్ బెల్ట్ ను అధికారులు శాయశక్తులా ప్రయత్నించి ఎట్టకేలకు పునరుద్ధించారు. కన్వేయర్ బెల్ట్ పునరుద్ధరణతో రెస్క్యూ ఆపరేషన్ స్పీడప్ అయ్యింది. టన్నెల్‌లో పేరుకుపోయిన బురద మట్టిని బయటకు పంపిస్తున్నారు. గంటకు 800 టన్నుల మట్టిని బయటికి డంపింగ్ చేస్తున్నారు. ఎస్ఎల్బీసీ రెస్క్యూ ఆపరేషన్ క్లిష్టతరం కావడంతో ఢిల్లీ నుంచి నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ ప్రతినిధుల బృందం రంగంలోకి దిగింది. టన్నెల్ వద్ద ప్రమాద ఘటన స్థలాన్ని పరిశీలించి.. సహాయక చర్యల బృందాలకు కీలక సూచనలు చేసింది. ఇప్పటికే చివరి దశకు చేరుకున్న సహాయక చర్యలు.. కన్వేయర్ బెల్ట్ పునరుద్ధరించడంతో మరో ఒకటి, రెండు రోజుల్లో రెస్క్యూ ఆపరేషన్లో కీలక పురోగతి సాధించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. కాగా, నాగర్ కర్నూల్ జిల్లా దోమలపెంట సమీపంలో శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ టన్నెల్ దగ్గర 2025, ఫిబ్రవరి 22 ఉదయం ప్రమాదం జరిగింది. రిటైనింగ్ వాల్ కదుతుండగా 14వ కిలో మీటర్ వద్ద 3 మీటర్ల మేర పైకప్పు కుంగిపోయింది.. రిటైనింగ్ వాల్ కూలి టన్నెల్‌లో రింగులు విరిగిపడడంతో.. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ ఘటనలో 8 మంది కార్మికులు టన్నెల్‌లో చిక్కుకుపోయారు. వెంటనే అప్రమత్తమైన అధికారులు టన్నెల్‌లో చిక్కుకుపోయిన కార్మికులను కాపాడేందుకు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. టన్నెల్‌లో భారీగా బురద, నీరు ఉబకడంతో పాటు టన్నెల్ బోరింగ్ మిషన్ పరికరాలు రెస్క్యూ ఆపరేషన్ ఛాలెంజింగ్ గా మారాయి. అయినప్పటికీ సహాయక బృందాలు తీవ్రంగా కృషి చేసి ఘటన స్థలం వద్దకు చేరుకున్నాయి. టన్నెల్ వద్ద 11 రోజులుగా సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి. కన్వేయర్ బెల్ట్ పునరుద్ధరించడంతో సహాయక చర్యలు ఊపందుకున్నాయి.

# ఎంత మందికి తెలుసు : ఏలాంటి నిరసనలు, సంతాపాలకు ఏ కలర్ రిబ్బన్ పెట్టుకోవాలో..?



హైదరాబాద్ పెన్ పవర్:జనాలు ప్రతి కార్యక్రమానిగుర్తుగా రిబ్బన్లు వాడుతుంటారు. అయితే ఒక్కోకలర్ రబ్బన్ ఒక్కో కార్యక్రమానని సూచిస్తుంది. సాధారణంగా జబ్బులు, సంతాపాలు, నిరసనలను తెలిపేందుకు సందర్భాన్ని బట్టి ఒక్కో కలర్ రిబ్బన్ పెట్టుకుంటాం. కొన్ని జబ్బులు.. వాటి పేర్లతో కంటే, వాటిని సూచించే కలర్ రిబ్బన్లోనే తెలిసిపోతాయి. కానీ.. ఏ కలర్ రిబ్బన్ ఏ సందార్భాల్లో పెట్టుకోవాలో.. చాలామందికి తెలియదు. ఇప్పుడు ఏ కలర్ రిబ్బన్ దేనికి ఉపయోగిస్తారో తెలుసుకుందాం. .

**వైట్ :** గర్భిణులపై దాడులు జరిగినప్పుడు, అందుకు వ్యతిరేకంగా తెలిపే నిరసన కార్యక్రమాల్లో వైట్ రిబ్బన్ పెట్టుకుంటారు. శాంతి, అహింసల కోసం తెలుపుతూ జరిగే కార్యక్రమాల్లో కూడా తెల్ల రిబ్బన్ ఉపయోగిస్తారు.

**రెడ్ :** ఎయిడ్స్, బ్లడ్ క్యాన్సర్, హార్ట్ డిసీజ్, విపత్తు, వ్యసనం.. లాంటి వాటిపై అవగాహన కల్పించేందుకు పెట్టే మీటింగులలో రెడ్ కలర్ రిబ్బన్లు పెట్టుకుంటారు. దీంతో పాటు ఎమర్జెన్సీ పరిస్థితుల్లో వీటిని ఉపయోగిస్తారు.

**గులాబీ :** ఈ కలర్ రిబ్బన్ మహిళల ఆరోగ్యానికి సంబంధించిన విషయాలను సూచిస్తుంది. ముఖ్యంగా ఆడవాళ్లలో రొమ్ము క్యాన్సర్ పై అవగాహన కల్పించేందుకు దీన్ని అంతర్జాతీయ గుర్తుగా ప్రకటించారు.

**గ్రీన్ :** కిడ్నీ, లివర్, అవయవదానం, సురక్షితంగా వెహికల్ నడపడం.. లాంటి వాటికి గ్రీన్ కలర్ రెబ్బన్ వాడతారు. గ్లోబల్ వార్మింగ్ తెలిపే సందర్భాల్లోనూ దీన్ని ఉపయోగిస్తారు.

**బ్లాక్ :** డిమాండ్ల కోసం.. నిరసన వ్యక్తం చేస్తున్నప్పుడు బ్లాక్ కలర్ రిబ్బన్ లను వాడతారు. దీంతో పాటు చనిపోయిన వాళ్లకు సంతాప సూచికగా నివాళి అర్పించేటప్పుడు ఈ రంగు రిబ్బన్ లు పెట్టుకుంటారు.

**పసుపు :** యుద్ధ ఖైదీలు, తప్పిపోయిన వాళ్ల కోసం ఏర్పాటు చేసిన మీటింగ్‌లో పసుపురంగు పట్టీలను పెట్టుకుంటారు. ఆత్మహత్యల నివారణకు, ఎముకల క్యాన్సర్ వాటి అవగాహనకు నిర్వహించే సదస్సుల్లో కూడా వీటిని పెట్టుకుంటారు.

**బ్లూ :** ఈ రిబ్బన్లను దాదాపు వందకు పైగా సందర్భాల్లో ఉపయోగిస్తారు. ఆడపిల్లల్ని ఎత్తుకుపోయి వ్యభిచార వృత్తిలో దించడం, బెదిరింపులకు వ్యతిరేకంగా ఈ రిబ్బన్లు పెట్టుకుంటారు. నీళ్లు పొదుపుగా వాడడంపై అవగాహన కల్పించే టైంలో కూడా బ్లూ కలర్ రిబ్బన్లను ఇస్తారు.

## అవగాహన సదస్సు: మార్చి 8న నెక్లెస్ రోడ్డులో వాక్‌థన్




**హైదరాబాద్ పెన్ పవర్:**మహిళలపై రోజు రోజుకు దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయని హింసలేని సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ది ఓబస్ట్రిక్స్ %ం% గైనకాలజీకల్ సోసైటీ ఆఫ్ హైదరాబాద్ (ఒ.జి.ఎస్.హెచ్) అధ్యక్షురాలు డాక్టర్ ఎస్.శాంతకుమారి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8న నెక్లెస్ రోడ్డులోని హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్ లో మహిళలపై హింస చేయవద్దు అనే అంశంపై అవగాహన కల్పించి, వాక్ థన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ కార్యక్రమంకు సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరణ హైదరాబాద్ హైదర్ గూడలోని ఎన్ఎస్ఎస్ లో జరిగింది. వాక్‌థన్ కార్యక్రమానికి రాష్ట్రమంత్రి సీతక్క, పరిశ్రమలు, వాణిజ్యశాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ లు హాజరుకానున్నట్లు తెలిపారు

## గత బీఆర్ఎస్ ప్రభుత్వం కులాల మధ్య చిచ్చు పెట్టింది.. బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్



**హైదరాబాద్ పెన్ పవర్:**గత బీఆర్ఎస్ ప్రభుత్వం కులాల మధ్య చిచ్చుపెట్టి , సహకార సంఘాలను విచ్చిన్నం చేసి... తమకు అనుకూలంగా ఉన్న వారికి లబ్ది చేకూర్చిందని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కులాల పేరుతో దళారి పనులు చేసే వారిని ప్రోత్సహించొద్దని విజ్ఞప్తి చేశారు. కులాల మధ్య అంతరాలకు నిరసనగా ట్యాంక్ బండ్ జలదృశ్యం లోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద తెలంగాణ రాష్ట్ర పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన మౌనదీక్ష దాసు సురేష్ మద్దతు తెలిపారు.

పద్మశాలీ సంఘం అధ్యక్షుడు రాజ్ కుమార్ తో కలిసి దాసు సురేష్ మాట్లాడుతూ... కులాలను సమన్వయం చేయాల్సిన పాలకులు కొన్ని సంఘాలను మాత్రమే నెత్తిన పెట్టుకోవడం సరైంది కాదన్నారు. దీనివల్ల కులానికి జరిగే ప్రయోజనం కంటే , వ్యక్తిగత ప్రయోజనాలే ఎక్కువ ఉంటాయన్నారు.ప్రభుత్వం పెద్దన్న పాత్ర పోషించి , అన్ని కులాలకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పద్మశాలీ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు.

# పంజాగుట్ట సర్కిల్.. ఫుల్ సైరన్ మోగిస్తూ అతి వేగంగా అంబులెన్స్.. తీరా చూస్తే అందులో కుక్క

**హైదరాబాద్ పెన్ పవర్:**అంబులెన్స్ సైరన్ మోగిస్తూ వస్తుంది అంటే చాలు.. ఎంత ట్రాఫిక్‌లో ఉన్నా సైడ్ ఇవ్వటానికి ప్రయత్నిస్తారు. రెడ్ సిగ్నల్ పడినా అంబులెన్స్ వెళ్లేందుకు దారి ఇస్తారు. ఇక హైదరాబాద్ సిటీలో అయినా ఇదే తీరు. వెనక అంబులెన్స్ సైరన్ వినిపిస్తోంది అంటే.. ఎంత ట్రాఫిక్ ఉన్నా దారి ఇస్తారు. ఇటీవల కొంతమంది అంబులెన్స్ డ్రైవర్లు ఆ సైరన్‌ను దుర్వినియోగం చేస్తున్నారు. అంబులెన్స్‌లో పేషెంట్లు లేకపోయినా సైరన్ వేస్తూ స్పీడ్‌గా వెళుతున్నారు. ఈ ఘటనపై దృష్టి పెట్టిన హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు చేయటం మొదలుపెట్టారు. ఈ క్రమంలోనే పంజాగుట్ట సర్కిల్ దగ్గర.. ఓ అంబులెన్స్ తనిఖీ చేయగా పోలీసులు అవాక్కయ్యారు.. పబ్లిక్ పరేషాన్ అయ్యారు. ఆ అంబులెన్స్ డ్రైవర్ చేసిన పనికి కొడదామన్నంత కోపం వచ్చింది పబ్లిక్ కు..




**పూర్తి వివరాల్లోకి వెళితే..**

2025, మార్చి 4వ తేదీ మధ్యాహ్నం పంజాగుట్ట సిగ్నల్స్ దగ్గర అతి వేగంగా సైరన్ తో వస్తున్న అంబులెన్స్ వెళుతుంది. అనుమానం వచ్చిన పోలీసులు దాన్ని ఆపారు. అంబులెన్స్ ఓపెన్ చేసి చూస్తే అందులో పేషెంట్లు లేరు.. కుక్క ఉంది.. అంబులెన్స్ లో కుక్కను చూసి షాక్ అయ్యారు పోలీసులు. ఆ కుక్క కూడా నిక్షేపంగా ఉంది.. బౌ బౌ అంటూ అరుస్తుంది కూడా.. ఇంత నిక్షేపంగా ఉన్న కుక్క కోసం.. సైరన్ వేసుకుని.. అతి వేగంగా ఎందుకు వెళుతున్నావ్ అంటూ డ్రైవర్ ను ప్రశ్నించారు పోలీసులు. ఆ డ్రైవర్ చెప్పిన సమాధానంతో మరింత షాక్ అయ్యారు పోలీసులు.

ఈ కుక్క మా అంబులెన్స్ ఓనర్‌ది.. ఇంట్లో పెంచుకునే కుక్క ఇది.. ఈ కుక్కకు మియాపూర్ లోని ఆస్పత్రిలో పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించటానికి తీసుకెళుతున్నానంటూ చెప్పుకొచ్చాడు. కుక్కను తీసుకెళుతున్నావ్ సరే.. మరి సైరన్ ఎందుకు వేశావ్.. ఎందుకు అంత స్పీడ్ గా వెళుతున్నావ్ అంటే మాత్రం నోటి మాట రాలేదు. దీంతో అంబులెన్స్ ఓనర్, డ్రైవర్ పై కేసు పెట్టారు ట్రాఫిక్ పోలీసులు. అంబులెన్స్ సైరన్ దుర్వినియోగంపై కేసు పెట్టి విచారణ చేసి.. చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు పోలీసులు. అందరు వెధవలా ఇలా ఉండరు.. అందరూ ఇలా ఉంటారని అనుకోవటం తప్పు.. ఎవరో ఒక అంబులెన్స్ డ్రైవర్ చేసిన తప్పు వల్ల మిగతా అన్ని అంబులెన్స్ పై తప్పుడు అభిప్రాయం ఏర్పడే ప్రమాదం లేకపోలేదు అంటున్నారు పోలీసులు. అంబులెన్స్ కు దారి ఇవ్వటం అనేది మానవత్వంతో కూడుకున్నది.. ఒకరి ప్రాణాలను కాపాడినట్లు అవుతుంది అంటున్నారు. ఇలాంటి అంబులెన్స్ డ్రైవర్లపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేస్తున్నారు పోలీసులు.

# పీఎం కుసుమ్ స్కీమ్ అనుమతులు పునరుద్ధరించండి:



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రాష్ట్రానికి పీఎం కుసుమ్ పథకం కింద గతంలో ఇచ్చిన 4 వేల మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తికి అనుమతులను పునరుద్ధరించాలని కేంద్ర ఆహార పౌర సరఫరాలు, పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణకు గతంలో 4 వేల మెగావాట్లకు అనుమతులు ఇచ్చిన కేంద్రం, తర్వాత దానిని వెయ్యి మెగావాట్లకు కుదించిన విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

తెలంగాణలో కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలనే లక్ష్యంలో భాగంగా మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా సోలాల్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు ఏర్పాటు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు కేంద్ర మంత్రికి వివరించిన సీఎం రేవంత్.. గతంలో మంజూరు చేసిన 4 వేల మెగావాట్ల ఉత్పత్తి అనుమతులను పునరుద్ధరించాలని రిక్వెస్ట్ చేశారు.మంగళవారం (మార్చి 4) సీఎం రేవంత్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ఢిల్లీలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి రాష్ట్రానికి సంబంధించి పెండింగ్ అంశాలను వివరించారు. భారత ఆహార సంస్థకు (%ఖీజ×%) 2014-15 ఖరీఫ్ కాలంలో సరఫరా చేసిన బియ్యానికి సంబంధించి తెలంగాణకు బకాయి పెట్టిన రూ.1,468.94 కోట్లను వెంటనే విడుదల చేయాలని కోరారు. అప్పట్లో అదనపు లెవీ సేకరణకు సంబంధించిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించిందని, వాటిని వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన కింద మే 2021 నుంచి మార్చి 2022 వరకు సరఫరా చేసిన అదనపు బియ్యం, 2022 ఏప్రిల్ నెలలో సరఫరా చేసిన బియ్యానికి సంబంధించిన ఉత్తర్వులను ధ్రువీకరించుకుని అందుకు సంబంధించిన బకాయిలు విడుదల చేయాలని చెప్పారు. జూన్ 2021 నుంచి ఏప్రిల్ 2022 వరకు నాన్ ఎన్ఎఫ్ఎస్ఎ (నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్) కింద పంపిణీ చేసిన బియ్యానికి సంబంధించిన బకాయిలు రూ.79.09 కోట్లను కూడా వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ విషయాలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.

## వనపర్తి జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు



**హైదరాబాద్ పెన్ పవర్:**శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా వనపర్తి జిల్లా వ్యాప్తంగా ×నెల రోజుల పాటు "30 పోలీస్ ఆక్ట్" అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ.. 30 పోలీస్ ఆక్ట్ ఈ నెల, మార్చి 01 నుండి 31 వరకు అమల్లో ఉన్నందున జిల్లాలో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు,సమావేశాలు,ఊరేగింపులు, ధర్నాలు,ఫంక్షన్ హాల్లో కార్యక్రమాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమిగూడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. అనుమతులు లేకుండ పై కార్యక్రమాలు నిర్వహించిన నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారి తీసే సమావేశాలు, జన సమూహం చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. సోషల్ మీడియా నందు అనవసరమైన విషయాలను, రాజకీయ నాయకుల, కుల మతాల మధ్య చిచ్చు పెట్టే అంశాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులను నమోదు చేయబడతాయని తెలిపారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం శిక్ష అర్హులవుతారని తెలిపారు. నిషేధంలో ఉన్న నిబంధనలు తప్పనిసరిగా అందరూ పాటించాలని ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తు దరఖాస్తు చేసుకునే అనుమతులు తీసుకోవాలని ఎస్పీ కోరారు.

## ఎమ్మెల్సీగా ఆలపాటి రాజా గెలుపు సంబరాలు

**హైదరాబాద్ పెన్ పవర్:**పల్నాడు జిల్లా, గురజాల నియోజకవర్గ, పిడుగురాళ్ల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు పట్టభద్రుల ఎమ్మెల్సీ విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఉమ్మడి కృష్ణ గుంటూరు జిల్లాల పట్టభద్రుల(గ్రాడ్యుయేట్స్) ఎమ్మెల్సీ ఎన్నికలలో ఉమ్మడి కృష్ణ గుంటూరు జిల్లాల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఘన విజయం సాధించిన సందర్భంగా ఈ విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సంబరాలలో తెలుగుదేశం పార్టీ యువ నాయకులు యరపతినేని నిఖిల్ మరియు కూటమి నాయకులు పాల్గొని కేక్ కట్ చేసి ఆనందోత్సవాలతో శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

# రోహిత్ శర్మపై షమా వ్యాఖ్యలు.. తోటి భారతీయుడిగా క్షమాపణలు చెప్పిన కేటీఆర్!

- హిట్‌మ్యాన్‌పై కాంగ్రెస్ నేత షమా మహ్మద్ బాడీ షేమింగ్ వ్యాఖ్యలు
- లావుగా ఉంటాడని, బరువు తగ్గాల్సిన అవసరం ఉందంటూ షమా ట్వీట్
- ఆమె వ్యాఖ్యలను ఖండించిన బీసీసీఐ, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు
- తాజాగా 'ఎక్స్' వేదికగా షమా వ్యాఖ్యలపై స్పందించిన కేటీఆర్

**హైదరాబాద్ పెన్ పవర్:**భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మపై కాంగ్రెస్ అధికార ప్రతినిధి షమా మహ్మద్ చేసిన బాడీ షేమింగ్ వ్యాఖ్యలు దుమారం రేపిన సంగతి తెలిసిందే. అతను లావుగా ఉంటాడని, బరువు తగ్గాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు. అంతటితో ఆగకుండా అతడి ప్రదర్శన ఏమాత్రం ఆకట్టుకునేలా ఉండదని, దేశ చరిత్రలో ఆకట్టుకోలేని కెప్టెన్ అతడేనని, అదృష్టం కొద్దీ కెప్టెన్ అయ్యాడంటూ షమా సోషల్ మీడియా వేదికగా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బీజేపీ నేతలతో పాటు క్రికెట్ ఫ్యాన్స్ కూడా ఆమె వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. అటు బీసీసీఐ కూడా రోహిత్‌పై షమా బాడీ షేమింగ్ వ్యాఖ్యలు దురదృష్టకరమని పేర్కొంది. అలాగే పలువురు మాజీ క్రికెటర్లు, రాజకీయ ప్రముఖులు కూడా ఆమె వ్యాఖ్యలు సరైనవి కావని అన్నారు. ఈ వివాదంపై తాజాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించారు. అవమానకర, బాడీ షేమింగ్ వ్యాఖ్యలు కాంగ్రెస్ వారికి కొత్త కాదని ఆయన చురకలంటించారు. "రోహిత్‌పై కాంగ్రెస్ అధికార ప్రతినిధి షమా మహ్మద్ చేసిన వ్యాఖ్యలపై చాలా మంది ఎందుకు కోపంగా ఉన్నారో నాకైతే అర్థం కావడం లేదు. బాడీ



షేమింగ్, అవమానకర వ్యాఖ్యలు, భ్రాంతికర ప్రకటనలు కాంగ్రెస్ పార్టీ ముఖ్య లక్షణం. హిట్‌మ్యాన్‌కు కాంగ్రెస్ ప్రతినిధి నుంచి ఫిట్‌నెస్ సలహా, విజయాలపై ఉపన్యాసాలు అవసరమని అనుకోవడం పెద్ద జోక్.

సినిమా తారలు, వారి కుటుంబ సభ్యులపై అవమానకర వ్యాఖ్యలతో ఒక తెలంగాణ మంత్రి కోర్టుకు హాజరవుతున్నారని మీకు తెలుసా...? రోహిత్ భాయ్ మీరు అనుభవించిన కఠిన క్షణాలకు ఒక తోటి భారతీయుడిగా క్షమాపణలు చెబుతున్నా. మీరు ఒక సంపూర్ణ రాక్‌స్టార్. ఏ తెలివి తక్కువ రాజకీయ నేత అభిప్రాయం మీ ప్రతిష్ఠను దెబ్బతీయలేదు" అని కేటీఆర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

# ఇవాళ్టి నుంచి ఇంటర్ ఎగ్జామ్స్

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో మార్చి 5 నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్షల సమయంలో విద్యార్థులకు ఇంటర్ బోర్డు కీలక సూచనలు చేసింది. ఇంటర్ పరీక్షల్లో ఒక్క నిమిషం నిబంధనను సడలించారు. ఈసారి కూడా 'ఒక్క నిమిషం ఆలస్యం' నిబంధన వర్తించదు. దీంతో పరీక్ష ప్రారంభమైన తర్వాత 5 నిమిషాల వరకు విద్యార్థులకు పరీక్ష కేంద్రంలోకి అనుమతించనున్నారు. అంటే ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభమైతే.. ఉదయం 9.05 గంటల వరకు మాత్రమే విద్యార్థులను అనుమతించనున్నారు. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య సూచించారు. విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకుంటే ఎలాంటి ఆందోళన లేకుండా పరీక్ష రాసుకోవచ్చన్నారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులు ముందుగా చేరుకునేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. నిబంధనల ప్రకారం ఉదయం 8.45 గంటల నుంచి 9 గంటల మధ్యలో ఓఎంఆర్ పత్రాన్ని విద్యార్థులు పూర్తి చేయాలని, ఎవరికి వారు తమకిచ్చిన పత్రంపై తమ వివరాలే ఉన్నాయా? లేవా? అని సరిచూసుకోవాలన్నారు.

### పరీక్షలకు హాజరుకానున్న 9.96 లక్షల విద్యార్థులు..

ఈ సారి ఇంటర్ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 9,96,971 విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో ఫస్టియర్ 4,88,448 మంది; సెకండియర్ 5,08,523 మంది విద్యార్థులు ఉన్నారు. వీరి కోసం రాష్ట్రవ్యాప్తంగా 1,532 ఎగ్జామ్ సెంటర్లను ఇంటర్ బోర్డు ఏర్పాటుచేసింది. ఇందులో 49 సెల్ఫ్ సెంటర్లు ఉన్నాయి. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల్లో ఈసారి కూడా అమ్మాయిల సంఖ్య ఎక్కువగా ఉంది. ఈసారి పరీక్షలకు ప్రథమ, ద్వితీయ సంవత్సరాలు కలుపుకొని అబ్బాయిలు 4,97,528 మంది ఉండగా.. 4,99,443 మంది అమ్మాయిలు ఉన్నారు. అంటే 1,915 మంది అధికం. ఏకంగా 27 జిల్లాల్లో బాలికల సంఖ్య అధికంగా ఉండగా... కేవలం ఆరు అర్బన్ జిల్లాల్లో బాలురు అధికంగా ఉన్నారు.

? ఈసారి హాల్‌టికెట్లపై క్యూఆర్ కోడ్ ముద్రించారు. దాన్ని స్కాన్ చేసి పరీక్షా కేంద్రం లొకేషన్ తెలుసుకోవచ్చు. ఒకరోజు ముందుగానే పరీక్ష కేంద్రాన్ని పరిశీలించి రావడం మంచిది.

ప్రశ్నపత్రంపై సీరియల్ నంబరు ముద్రించారు. దీంతో ఏ సంఖ్య పేపర్.. ఏ విద్యార్థికి వెళ్తుందో దీనిద్వారా తెలుసుకోవచ్చు. ప్రశ్నపత్రం ఒకవేళ బయటకు వచ్చినా.. అది ఏ పరీక్షా కేంద్రం, ఏ విద్యార్థిదని వెంటనే తెలుసుకోవచ్చు.

ప్రశ్నపత్రంలో ఏమైనా పొరపాట్లు ఉంటే పరీక్ష ప్రారంభమైన తర్వాత సవరించుకోవాలని సమాచారం ఇస్తారు. ఇన్విజిలేటర్లు ఆ విషయాన్ని చెబుతారు. ఆ ప్రకారం విద్యార్థులు సరిచేసుకొని సమాధానాలు రాయాలి.

గతేడాది వరకు పరీక్షకు సాధారణ(అనలాగ్) చేతిగడియారాలను అనుమతించేవారు. అయితే పరీక్షల సమయంలో అధిక సంఖ్యలో విద్యార్థులు ఉంటుండటంతో ఏది అనలాగ్, ఏది స్మార్ట్‌వాచ్ అనేది గుర్తించే పరిస్థితి లేదు. అందుకే ఈసారి ఏ రకమైన చేతిగడియారాలనూ తీసుకెళ్లేందుకు అనుమతి లేదు.

### కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు..

పరీక్షల పర్యవేక్షణ కోసం బోర్డు కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ని అధికారులు ఏర్పాటు చేశారు.

# వికారాబాద్ జిల్లా కు చెందిన వివాహిత యువతి హైదరాబాద్ లో ఆత్మహత్య.

**హైదరాబాద్ పెన్ పవర్:**ఉన్నత చదువులు చదివి సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తూ ఏర్పడిన పరిచయం ప్రేమగా మారిన జంట ప్రేమించి, పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్నారు.పెళ్లయిన ఆరు నెలలు గడవకముందే ఇద్దరి మధ్య తరచూ గొడవలు ప్రారంభమై తీవ్ర మనస్థాపానికి గురైన భార్య ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం?

వికారాబాద్ జిల్లా, తోర్ మామిడి కమలాపురం ప్రాంతానికి చెందిన దేవిక (25) పుణేలో ఎంబిఏ పూర్తి చేసి నగరంలోని ఓ సాఫ్ట్ వేర్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నది. ఐఐటి ఖరగ్ పూర్ లో ఇంజనీరింగ్ పూర్తి చేసిన మంచిర్యాలకు చెందిన సద్గుర్తి సతీష్ చంద్ర కూడా దేవిక పనిచేస్తున్న సాఫ్ట్ వేర్ సంస్థలోనే ఇంజనీర్ గా పనిచేస్తున్నాడు. ఒకే కార్యాలయం కావడంతో దేవిక, సతీష్ చంద్రల మధ్య పరిచయం ఏర్పడి, ప్రేమగా మారడంతో ఇద్దరు పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇరువైపుల పెద్దలను ఒప్పించి గత ఆగస్టు 23వ తేదీన గోవాలో వైభవంగా వివాహం చేసుకున్నారు.

వివాహం అనంతరం భార్య, భర్తలు రాయదుర్గం పరిధిలోని ప్రశాంతిహిల్స్ లో కాపురం పెట్టారు. పెళ్లైన కొద్దిరోజులకే భార్య, భర్తల మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ మధ్య కాలంలో ఇద్దరి మధ్య తరచూ గొడవలు చోటుచేసుకుంటున్నాయి. ఇదే క్రమంలో ఆదివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో దేవిక, సతీష్ చంద్రలు ఇంట్లో గొడవ పడ్డారు. దీంతో మనస్థాపానికి గురైన దేవిక తన గదిలోకి వెళ్లి లోపలి నుంచి గడియ పెట్టుకుంది. శతీష్ చంద్ర సైతం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి అర్ధరాత్రి 12 గంటల తరువాత తిరిగి వచ్చాడు.

అప్పటికీ దేవిక గది తలుపులు పెట్టి ఉండడంతో తలుపు తట్టి చూడగా, లోపలి నుంచి గడియపెట్టి ఉండడంతో నిద్రపోయిందని భావించి తనగదిలోకి వెళ్లి నిద్రపోయాడు. తెల్లవారు జామున లేచిన సతీష్ చంద్ర మరోసారి దేవిక గది తలుపుతట్టినా స్పందించలేదు. ఉదయం పనిమనిషి వచ్చి తలుపుకొట్టినా దేవిక తలుపు తీయలేదు. మరోవైపు ఉదయం 10 గంటలకు దేవిక ఆఫీసుకు వెళ్లాల్సి ఉండగా, అప్పటికీ తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చిన సతీష్ చంద్ర గది తలుపులు బద్దలుకొట్టి చూడగా, గదిలో ఉన్న సీలింగ్ ఫ్యాన్ కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొని కనిపించింది.స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు మృతురాలి తల్లి రామలక్ష్మి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా కట్నం కోసం తరచూ శతీష్ చంద్ర వేదించడంతోనే తన కుమార్తె మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లి పోలీసులకు పిర్యాదు చేసింది.

# త్వరలోనే నియోజకవర్గానికి మరో వెయ్యి కోట్ల అభివృద్ధి నిధులు

**హైదరాబాద్ పెన్ పవర్:** వనపర్తి నియోజకవర్గంలో 14 నెలల్లో 1000 కోట్ల అభివృద్ధి పనులను చేపట్టామని, త్వరలోనే మరో 1000 కోట్ల అభివృద్ధి పనులకు అనుమతులు తీసుకురానున్నట్లు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.

ఈనెల 2వ తేదీ ఆదివారం రోజున వనపర్తి పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన ముఖ్యమంత్రి భారీ బహిరంగ సభను విజయవంతం చేసిన మండల నాయకులకు, కళాకారులకు, మహిళలకు, యువకులకు, బహిరంగ సభ విజయవంతం చేసేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు

ఎమ్మెల్యే మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే గా ఉత్తమ సేవలందించిన మాజీ శాసనసభ్యులు గుమ్మడం జయరాములు యాదవ్, ప్రజా డాక్టర్ బాలకిష్టయ్య గార్లకు సముచిత స్థానం కల్పించేందుకు వారి పేర్లను ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషనల్ హబ్, ప్రభుత్వ ఆసుపత్రిలకు పెడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఇందుకు ముఖ్యమంత్రివర్యులు సానుకూలంగా స్పందించి వెంటనే ప్రభుత్వ అనుమతులు జారీ చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ కు ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వనపర్తి నియోజకవర్గంలో కొందరు నాయకులు శిఖండి రాజకీయాలు చేస్తున్నారని అన్నారు.

వారు నేరుగా ఏం చేయలేక ఇతరులను బలిచేస్తూ తెరచాటుగా రాజకీయాలు చేయడం మానుకోవాలని ఆయన సూచించారు. గతంలో రాష్ట్రంలోనే నెంబర్ 4 అని చెప్పుకునే నాయకులను వనపర్తి నియోజకవర్గ ప్రజలు నేలకేసి కొట్టారని అయినా బుద్ధి రాలేదని ఆయన విమర్శించారు. గతంలో ఐటి టవర్ నిర్మాణానికి మంజూరీలు తీసుకొచ్చామని ప్రగల్భాల్ పలికిన నాయకులు అందుకు సంబంధించిన జీవోలను తీసుకురావడంలో ఎందుకు విఫలమయ్యారని ఆయన ప్రశ్నించారు. ఔటర్ రింగ్ రోడ్డుకు నిర్మాణానికి తామేదో శ్రమించి అనుమతులు తీసుకొచ్చామని చెప్పే నాయకులు అటవీ శాఖ అనుమతులు లేకుండానే రింగ్రోడ్డు ఎలా పూర్తవుతుందన్న ఆలోచన ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. కేవలం పేపర్ల మీద అభివృద్ధి చూపిస్తే నియోజకవర్గం అభివృద్ధి కాదని ఆయన చెప్పారు. నేడు ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి కొత్త జీవోలతోనే పనులు ప్రారంభించామని పాత జీవోలపై పనులు ప్రారంభించేంత క్యారెక్టర్ మాకు లేదన్నారు. కేవలం 5 సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఉండి వనపర్తి నియోజకవర్గంలో విధ్వంసం సృష్టించారని, కేవలం స్వార్ధ రాజకీయాల కోసం స్వలబ్దికోసం పనులు చేపట్టారే తప్ప పూర్తిస్థాయి అభివృద్ధి పై దృష్టి సారించలేదని ఆయన విమర్శించారు. గతంలో చేపట్టిన పనులకు జీవోలు తెచ్చారని చెప్పే నాయకులు ఒక విషయం మర్చిపోయారని వారి హయాంలో చేపట్టిన గత పనులైనటువంటి కల్వకుర్తి ఎత్తిపోతలకు బొక్కలు కొట్టి తామే సాధించామని చెప్పడం సిగ్గుచేటు కాదా.. అని ఎమ్మెల్యే ఘాటుగా స్పందించారు.

కొందరు నాయకులు కడుపులో కత్తెర్లు పెట్టుకుని నియోజకవర్గంలో రాజకీయం చేస్తున్నారని అలాంటి రాజకీయాలు సరికావని ఇప్పటికైనా అభివృద్ధి పనుల పై దృష్టి సారించి ముందుకెళ్తే నియోజకవర్గం త్వరితగతిన అభివృద్ధి చెందుతుందని ఆయన హితవు పలికారు.

గొల్లపల్లి కొత్త రిజర్వాయర్ నిర్మాణానికి త్వరలోనే ప్రభుత్వ జూఅనుమతులను తీసుకొస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఒక్కో గ్రామపంచాయతీ అభివృద్ధి కోసం 20 లక్షలు నిధులు మంజూరు చేయించేందుకు ప్రభుత్వానికి నివేదికలు సమర్పించామని ఎమ్మెల్యే తెలిపారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వనపర్తి పట్టణ అధ్యక్షులు చీర్ల విజయ చందర్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి ఆదిత్య, పెబ్బేరు మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ కిచ్చా రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణయ్య, మాజీ కౌన్సిలర్ వెంకటేశ్వర్లు, గంధం శరవంద, రవి యాదవ్, వనపర్తి నియోజకవర్గ సమన్వయకర్త లక్కాకుల సతీష్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మరో భారీ ఎన్కౌంటర్.. ముగ్గురు నక్సల్స్ మృతి



**హైదరాబాద్ పెన్ పవర్:**ఛత్తీస్గఢ్లోని ధామ్తారి జిల్లాలో భారీ ఎన్కౌంటర్ జరిగింది. ఈ ఎదురుకాల్పుల్లో ముగ్గురు నక్సల్స్ మృతిచెందగా.. మరికొందరికి గాయాలయ్యాయి. నక్సలైట్ శిబిరాన్ని డీఆర్జీ సైనికులు ధ్వంసం చేశారు. ఖల్లారి పోలీస్ స్టేషన్ పరిధిలోని మాదగిరి అడవుల్లో ఎన్కౌంటర్ కొనసాగుతోంది. కొండ ప్రాంతంలో 25 నుంచి 30 మంది నక్సలైట్లు ఉన్నట్లు సమాచారంతో భద్రతా బలగాలు గాలింపులు చేపట్టాయి.

## మామూనూరు లు ఎయిర్పోర్ట్ భూ నిర్వాసితుల ఆందోళన

**వరంగల్: పెన్ పవర్:**మామునూరు ఎయిర్ పోర్టు భూ నిర్వాసితులు అందోళనకు దిగారు. నక్కలపల్లి,గుంటూరుపల్లి,నల్లకుంట,గాడిపెల్లి ఎయిర్పోర్టు కి భూమి కోల్పోతున్న రైతులు రోడ్డెక్కారు. తమ ఊరికి వచ్చే రోడ్డుకి ప్రత్యామ్నాయ రోడ్డు కావాలని గుంటూరు పెల్లి, గాడిపెల్లిరైతులు కోరారు. రైతులకు మార్కెట్ ధరకి తగినట్టుగా పరిహారం ఇస్తే భూములు ఇస్తాం అంటున్నారు. సరైన పరిహారం మా గ్రామాలకు ప్రత్యామ్నాయ రోడ్డు మార్గాలు చూపిస్తేనే సర్వే అనుమతిస్తామంటున్నారు. 200 మంది రైతుల ఆందోళన,జై జవాన్ జై కిసాన్ అని నినాదాలు చేసారు. ఏలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీగా మోహరించారు. ధర్నాకు అనుమతి లేదు అని రైతులతో పోలీసులు వాదించారు. .

## బ్యాంకు అధికారులు వేధింపులు రైతు ఆత్మహత్యాయత్నం

**నల్గొండ: పెన్ పవర్:**మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నియోజకవర్గంలో రుణం కట్టాలని రైతుకు బ్యాంకు అధికారుల వేధింపులు ఎదురయ్యాయి. దాంతో పురుగుల మందు తాగిని రైతు చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. నల్గొండ జిల్లా కనగల్లు మండలం జీ యడవల్లి గ్రామంలో రైతు గౌని వెంకన్నకు కో–ఆపరేటివ్ బ్యాంకులో రూ. 1,60,000 రుణం ఉంది. ఈ రుణం మాఫీ అవ్వలేదు.. ఈ రుణాన్ని కట్టాలని బ్యాంకు అధికారులు 7 రోజుల క్రితం రైతు భూమిలో జెండాలు పాతారు. మళ్ళీ ఈ రోజు వచ్చి రుణం కట్టకుంటే ఊరిలో దప్పు సాటు వేస్తామని, పొలాన్ని స్వాధీనం చేసుకుంటామని వేధించారు. బ్యాంకు అధికారుల వేధింపులు తట్టుకోలేక మనస్తాపానికి గురైన రైతు వెంకన్న వరి చెనుకు కొట్టే పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు రైతును ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉంది.

# రూ.15 కోట్ల విలువైన గంజాయి స్వాధీనం

**హైదరాబాద్ పెన్ పవర్:**ముంబయి ఎయిర్ పోర్టులో కస్టమ్స్ అధికారులు భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సూరత్‌కు చెందిన నలుగురు యువకులు ఇటీవల బ్యాంకాక్ వెళ్లారు. వారు మంగళవారం ముంబయికు తిరిగి రాగా వారి వద్ద భారీగా గంజాయి పట్టుబడింది. బ్యాంకాక్‌కు చెందిన ఓ డ్రగ్ పెడ్లర్ నలుగురిని థాయ్ లాండ్ చూపిస్తానని పిలిపించి తిరిగి వెళ్లే క్రమంలో వారి బ్యాగులలో డ్రగ్స్ పెట్టినట్లు సమాచారం. పట్టుబడిన గంజాయి విలువ రూ.15.85 కోట్లు ఉంటుందని తెలిపారు.

# గ్యాస్ సిలిండర్ పేలి ఒకరికి తీవ్ర గాయాలు

**వనపర్తి పెన్ పవర్:** కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బాగ్ అమీర్ లోని జయ భవాని గోల్డెన్ ఇన్ఫోసిస్టమ్ ఎలక్ట్రికల్ అండ్ గ్యాస్ సర్వీసెస్లో గ్యాస్ సిలిండర్ పేలి దానిలో ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. డొమెస్టిక్ సిలిండర్ నుండి చిన్న చిన్న వాటిలో అక్రమంగా గ్యాస్ రీఫిలింగ్ చేస్తుండగా ఒక్కసారిగా భారీ శబ్దంతో గ్యాస్ సిలిండర్ పేలుడు సంభవించింది దీనితో చుట్టుపక్కల ఉండేవారు భయభ్రాంతులకు గురయ్యారు. పేలుడిదాటికి షాపు మొత్తం శిథిలమైపోయింది. ప్రస్తుతం జతగాత్రుడికి ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు ఘటన పైన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నివాసాల వద్ద ఇటువంటి ఏర్పాటు చేయడం పట్ల స్థానిక ప్రజలు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# హైదరాబాద్ ను దేశ రెండో రాజధాని చేయాలి

**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ ను దేశ రెండో రాజధాని చేయాలని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మనవడు ప్రకాష్ అంబేద్కర్, ఎమ్మెల్సీ కోదండరాం, రిటైర్డ్ ఐఆర్ఎస్ నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రకాశ్ అంబేద్కర్ మాట్లాడుతూ హైదరాబాద్ రెండో రాజధానిగా చెయ్యాల్సిన అవసరం ఉందన్నారు. మూడో ప్రపంచ యుద్ధంపై చర్చ జరుగుతుందని... పాకిస్థాన్, చైనా మనకు సరిహద్దు శత్రువులని ఢిల్లీకి సమీపంలో ఉన్నాయని అన్నారు. రాజధానిని ఢిల్లీ నుంచి సౌత్ ఇండియా కి మార్చాలని పేర్కొన్నారు. హైదరాబాద్ కి అన్ని సౌకర్యాలు ఉన్నాయని.. దేశానికి రెండో రాజధాని చేయాలని సూచించారు. చిన్న రాష్ట్రాలుగా ఉన్న దక్షిణాది రాష్ట్రాలు... డిలిమిటేషన్ వల్ల నష్టపోతామని భావిస్తున్నాయని వివరించారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఢిల్లిని రాజధాని ఉంచడం కష్టమైన పని అని... పాకిస్థాన్ కు దగ్గర్లో ఉండటం వల్ల ఇబ్బంది అవుతుందని తెలిపారు.

# బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర నూతన బ్రాంచ్ ప్రారంభం

**హైదరాబాద్ పెన్ పవర్:**ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధిలో బ్యాంకు అఫ్ మహారాష్ట్ర నూతన బ్రాంచ్ ప్రారంభోత్సవం జోనల్ మేనేజర్ జీవీస్ ప్రసాద్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది జ్యోతి ప్రజ్వలన చేసి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 73 వ బ్రాంచ్ ఈ రోజు ఘట్కేసర్ లో ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉంది అన్నారు మా బ్యాంకు మిగతా బ్యాంకు ల కంటే నాణ్యమైన సేవలు అందిస్తూ అభివృద్ధి లో ముందజ లో వుంది అన్నారు ఈ బ్రాంచ్ లో కుడా కస్టమర్స్ అందరూ మా సేవలు వినియోగించుకోవాలని చెప్పారు స్టాఫ్ కి కస్టమర్స్ కి శుభాకాంక్షలు తెలియచేసారు

# కార్మికులారా ఎవరికి భయపడాల్సిన అవసరం లేదు



**హైదరాబాద్ పెన్ పవర్:**మంత్రి శ్రీధర్ బాబు , ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాగూర్, కనీస వేతనాల మినిమం బోర్డు అడ్వైజర్ చైర్మన్ జనక్ ప్రసాద్ లు ఉన్నారని ఐ ఎన్ టి ఏ సి ఆర్జీ టు వైస్ ప్రెసిడెంట్ శంకర్ నాయక్ స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆర్జీ టు ఏరియాలోని వకీల్ పల్లి గని యందు కార్మికులను కలిసి వారికి ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిప్యూటీ జనరల్ సెక్రెటరీ సంపత్ రెడ్డి తో కలిసి శంకర్ నాయక్ మాట్లాడుతూ కొంతమంది కార్మికుల అవసరాలను ఆసరాగా చేసుకొని డబ్బులు దండుకుని ప్రయత్నం చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చిందన్నారు. కంపెనీ నిబంధనల ప్రకారం ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా పారదర్శకతకు పెద్దపీట వేస్తూ ఓ పెన్ కాస్ట్ లకు ట్రాన్స్ఫర్లను చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎవరికి ఏ సమస్య తలెత్తిన నాకు ఒక ఫోన్ కొడితే నిమిషాలల్లో మీ ముందు వాలిపోతానని ఆయన కార్మికులకు భరోసనిచ్చాడు. సింగరేణి కార్మికులకు సొంతింటి కల కోసం, వడ్డీ లేని 30 లక్షల రుణం ఇప్పించుటకై మనకు ముఖ్యమంత్రి తర్వాత ముఖ్యమంత్రి గా ఉన్నటువంటి మన మంత్రి శ్రీధర్ బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాగూర్, జనప్రసాద్ లు తీవ్రమైన కృషి చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఐఎన్టీయూసీ పక్షాన మీకు అండగా మేము ఉంటాం, మీరు కూడా మమ్మల్ని ఆదరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రెటరీ సంపత్ రెడ్డి, సెంట్రల్ జాయింట్ జనరల్ సెక్రెటరీ దశరథం గౌడ్ ,బ్రాంచ్ కమిటీ నాయకులు కొంగర రవీందర్, కుమ్మరి విజయ్, పిట్ కార్యదర్శి జగదీష్, మల్లికార్జున్, భూమయ్య, మెగావత్ సురేష్, శ్రావణ్, శ్రీధర్ ,శ్రీకాంత్, రాజ్ మహ్మద్ ,అరుణ్ సంతోష్ ,శ్రీను,శశి, దేవేందర్ రెడ్డి మరియు ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం పోరుబాట

**హైదరాబాద్ పెన్ పవర్:**రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లి గ్రామంలో ఫార్మా సిటీ లో భూములు కోల్పోయిన రైతుల సమస్యలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వేస్లీ అడిగి తెలుసుకున్నారు.
అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జాన్ వేస్లీ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సిపిఎం పార్టీ పోరుబాట కార్యక్రమని నిర్వహిస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫార్మసిటీ ని రద్దు చేశామని స్పష్టమైన ప్రకటన చెయ్యాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. రైతుల సమస్యల ను పరిస్కారం చెయ్యకపోతే ప్రభుత్వం పై సిపిఎం పార్టీ పోరాటం చేస్తుందని ప్రభుత్వని హెచ్చరించారు. రైతులు స్వచ్ఛందంగా తమ భూములు ఇచ్చినట్లయితే రైతుల భూములను తీసుకోని మార్కెట్ విలువ ప్రకారం డబ్బులు చెల్లించని ప్రభుత్వని కోరారు. × బలవంతపు భూ సేకరణకు సిపిఎం పార్టీ వ్యతిరేకమన్నారు . × ఫార్మసిటీ ని రద్దు చేసి రైతులకు రుణమాఫీ,రైతు భరోసా,రైతు భీమా వంటి పథకాలకు అమలు చెయ్యాలని ప్రభుత్వని కోరారు. జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ సాగుకు యోగ్యమైన పంట భూములను తీసుకోని మమ్మలిని బతకుండా చేస్తున్నారు. 4బిఫ్ర సిటీ పేరుతో మనలని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. లఘుచెర్ల భూములను తీసుకోని ఫార్మా సిటీ ని ఏర్పాటు చెయ్యాలని ప్రయత్నం చేస్తే సిపిఎం పార్టీ రైతులకు అండగా ఉండి ఫార్మసిటీ ని రద్దు చేయించిన చరిత్ర సిపిఎం పార్టీ దక్కుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య తెలిపారు.

# కరాటే లో పథకాలు సాధించిన విద్యార్థులను అభినందించిన మాజీమంత్రి కరీంనగర్ శాసనసభ్యులు గంగుల కమలాకర్



**కరీంనగర్: పెన్ పవర్:**మాజీ స్పీకర్ దుద్దిల్ల శ్రీపాదరావు జయంతిని పురస్కరించుకొని కరీంనగర్ పట్టణంలో ఈనెల రెండవ తేదీన శ్రీపదరావు మెమోరియల్ రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్షిప్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్ నగరంలోని ఎస్. ఆర్. ప్రైమ్ పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థినీ విద్యార్థులు వివిధ మెడల్స్ సాధించారు. ఈ నేపథ్యంలో కరీంనగర్ శాసనసభ్యులు గంగుల కమలాకర్ ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల వారు సాధించిన పథకాలను విద్యార్థులకు అందజేసి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. భవిష్యత్తులో మరిన్ని పథకాలు సాధించాలని ఆకాంక్షించారు. కరాటే లోని పలు విభాగాల్లో ఈ పథకాలను సాధించారు. సన్నిధి గోల్డ్ మెడల్,అన్వదక్ష రెడ్డి గోల్డ్ మెడల్,ఆర్యాహి సిల్వర్ మెడల్,ధనిక్షా సిల్వర్ మెడల్, మనస్విని సిల్వర్ మెడల్,ఉషశ్రీ బ్రాంజ్ మెడల్, రిషికేష్ బ్రాంజ్ మెడల్ లు సాధించారు. ఈ కార్యక్రమంలో కరాటే చీఫ్ ఇన్స్ట్రక్టర్ సురభి వేణుగోపాల్, ఎస్ఆర్ ప్రైమ్ జోనల్ ఇంచార్జ్ శశిధర్, పాఠశాల ప్రిన్సిపల్ రాజి రెడ్డి, పాఠశాల ఇంచార్జ్ వరుణ్ రావు,పిఈటి వంశీ, తదితరులు ఉన్నారు.

# రూ. 30వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూముల అమ్మకానికి సర్కారు పన్నాగం

**హైదరాబాద్ పెన్ పవర్:**భూముల అమ్మకంపై అసెంబ్లీని తప్పుదోవ పట్టించినందుకు రేవంత్ క్షమాపణలు చేప్పాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేసారు. ప్రతీ అంశం లో ప్లేటు ఫిరాయిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ భూముల అమ్మకం పై కూడా తన నాలుక ను మడత పెట్టి నిస్సిగ్గుగా నిధుల సమీకరణ కోసం వేలాల బాట పట్టిండు. భూముల వేలం పై మారిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరిని చూసి ఊసరవెల్లి సైతం ఉరి వేసుకునే పరిస్థితి నెలకొన్నది. "ప్రభుత్వ భూములంటే పెద్దలిచ్చిన ఆస్తి అని, తెలంగాణ జాతి సంపద అని, ఆ భూములను అమ్మితే భవిష్యత్తులో స్మశానాలు నిర్మించాలంటే కూడా భూమి లేకుండా పోతుందని" నాడు పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్ రెడ్డి మొసలి కన్నీరు కార్చిండని అన్నారు. తాము అధికారంలోకి వస్తే ఇంచు ప్రభుత్వ భూమిని కూడా అమ్మబోము అంటూ ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేసి ఇపుడు వేల కోట్ల విలువైన భూములను అగ్రాస్ వేసేందుకు తెరలేపిండని అన్నారు.

డిసెంబర్ లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం కపట బుద్ధిని ఆధారాలతో సహా బయటపెట్టాను. జూన్ 26, 2024 నాడు విడుదల చేసిన జీవో ఎంఎస్ 54తో ఎకరానికి 75 కోట్ల చొప్పున మొత్తం 30వేల కోట్ల విలువైన భూములను అమ్ముతున్నారని నేను అసెంబ్లీలో నిలదీస్తే.. అలాంటిదేమి లేదని, టీజీఐఐసీకి చేస్తున్న బూ బదలాయింపు మాత్రమేనని బుకాయించారు. ఆ భూములను అమ్ముకోవాలన్నా మీకు, మీ కాంగ్రెస్ ప్రభుత్వానికి కేసీఆర్ గారు పదేళ్ల కాలంలో సాధించిన అభివృద్ధిని ప్రచారం చేసుకోకతప్పడం లేదని అన్నారు. రేవంత్ రెడ్డి గారూ.. సీఆర్ చేసిన అభివృద్ధి మీరు ఎంత ప్రయత్నం చేసి దాచినా దాగదు. అసత్యాలు ప్రచారం చేయడం, ప్రతిపక్షాలను బుకాయించడం వంటివి ఇకనైనా మానుకోవాలని హితవు పలుకుతున్నా. భూములు అమ్మబోమని ప్రజలను, అసెంబ్లీని సైతం తప్పుదోవ పట్టించినందుకు యావత్ తెలంగాణకు క్షమాపణలు చెప్పాలని బీ ఆర్ ఎస్ పక్షాన ప్రభుత్వాన్నిడిమాండ్ చేస్తున్నాం. ప్రభుత్వ భూములు అమ్మితే స్మశానానికి కూడా జాగ ఉండదన్న రేవంత్ రెడ్డి.. ఇప్పుడు స్మశానాలకు భూములు ఎక్కడ పుట్టిస్తారో చెప్పాలని అన్నారు.

# టిప్పు సుల్తాన్ వారసుడినంటూ నిరుద్యోగులకు టోకరా..

**వరంగల్, మార్చి 4, పెన్ పవర్:**తాను టిప్పు సుల్తాన్ వారసుడినంటూ ఓ డాక్టర్ మోసాలకు తెరలేపాడు. ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ అమాయకులను నమ్మించాడు. అనంతరం వారి నుంచి రూ.5.56 కోట్ల వరకు వసూలు చేసి ఉడాయించాడు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు.. తాజాగా అతన్ని అరెస్టు చేశారు. తమిళనాడు రాష్ట్రం కుంభం ప్రాంతానికి చెందిన అబ్దుల్ రహీం సుల్తాన్ రాజా.. 2010లో రష్యాలో ఎంబీబీఎస్ చదివాడు. ఆ తరువాత సంగారెడ్డి జిల్లాకు వచ్చి అక్కడ ఓ ఫార్మసీ కాలేజీలో సీఎంవోగా పని చేశాడు. అనంతరం కరీంనగర్, హుస్నాబాద్ తదితర ప్రాంతాల్లో పని చేశాడు. ఆ తరువాత 2020లో జనగామలోని హనుమకొండ మార్గంలో కేకే హాస్పిటల్ పేరున ప్రైవేటు క్లీనిక్ ఓపెన్ చేసి నిర్వహిస్తున్నాడు. జనగామలో హాస్పిటల్ నడుపుతున్న సుల్తాన్ రాజా తన వద్దకు చికిత్స కోసం వచ్చే అమాయకులతో పరిచయం పెంచుకున్నాడు. వారితో మాట కలిపి తాను టిప్పు సుల్తాన్ వారసుడినని, టిప్పు సుల్తాన్ మెమోరియల్ ట్రస్ట్ ఛైర్మన్ తానేనంటూ అందరినీ నమ్మించాడు. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ట్రస్ట్ కు రూ.700 కోట్లు కేటాయించిందని, ఆ డబ్బులతో ట్రస్ట్ పేరిట హైదరాబాద్‌లో మెడికల్ కాలేజీ నిర్మిస్తానని చెప్పుకొచ్చాడు. అందులో వివిధ పనులకు సంబంధించిన కాంట్రాక్టులు, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానంటూ అమాయకులను నమ్మించాడు. కర్నాటక ప్రభుత్వం నుంచి రూ.700 కోట్లు ట్రస్ట్‌కు వస్తున్నాయని ఓ డీడీ తయారు చేసిన అబ్దుల్ రహీం సుల్తాన్ రాజా.. బిల్డింగ్ ఎలక్ట్రికల్ కాంట్రాక్ట్ ఇప్పిస్తానని జనగామ పట్టణానికి చెందిన ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టర్ వసీం అక్తర్‌కు చెప్పాడు. కాంట్రాక్ట్ ఇప్పించేందుకు వసీం అక్తర్‌తో బేరం కుదుర్చుకుని రూ.1.17 కోట్లు తీసుకున్నాడు. తన పలుకుబడితో హైదరాబాద్‌లోని ఈఎస్ఐ ఆసుపత్రిలో ఉద్యోగాలు ఇప్పిస్తానని.. జనగామకు చెందిన మేకల ఆనంద్ కుమార్ నుంచి 2021లో రూ.3.75 లక్షలు, గాడెపాక రాజ్ కుమార్ వద్ద నుంచి రూ.5.50 లక్షలు, పిపిరె సిద్దార్థ నుంచి రూ.5.50 లక్షలు, మరో ముగ్గురు వ్యక్తుల నుంచి రూ.14.75 లక్షల చొప్పున వసూలు చేశాడు. 2023లో జనగామకు చెందిన మారబోయిన పాండు నుంచి రూ.5 లక్షలు తీసుకున్నాడు. హైదరాబాద్ కు చెందిన ఎస్వీఎన్ చారీ అలియాస్ ఆచార్య(ఆడిటర్) వద్ద రూ.1.70 కోట్లు, రాజు అనే వ్యక్తి వద్ద రూ.50 లక్షలు, 2014లో కరీంనగర్ కు చెందిన సీహెచ్ అనిల్ వద్ద రూ.2 కోట్లు తీసుకున్నాడు. కానీ అబ్దుల్ రహీం ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ అవకాశాలు, కాంట్రాక్టులు రాకపోవడంతో వారంతా అతడిని నిలదీశారు. దీంతో తన అకౌంట్ కు ఇప్పుడే డబ్బులు వస్తున్నాయంటూ ఇంకో ఫోన్ నుంచి తన ఫోన్ కు మెసేజ్ లు పంపించుకుని బాధితులకు చెప్పి నమ్మించాడు. ఇలా మొత్తంగా రూ.5.56 కోట్లకు పైగా లాగేశాడు. టిప్పు సుల్తాన్ వారసుడినంటూ నిరుద్యోగులకు టోకరా.. టిప్పు సుల్తాన్ వారసుడినంటూ నిరుద్యోగులకు టోకరా.. బాధితుల నుంచి రూ.5.56 కోట్లకు పైగా వసూలు చేసిన అబ్దుల్ రహీం.. దాదాపు 8 నెలల నుంచి తప్పించుకు తిరుగుతున్నాడు. బాధితులు జనగామ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం అబ్దుల్ రహీం సుల్తాన్ రాజా జనగామలోని కేకే ఆసుపత్రికి వచ్చాడు. సీఐ దామోదర్ రెడ్డి, తన సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా.. అసలు విషయాన్ని అబ్దుల్ రహీం సుల్తాన్ రాజా ఒప్పుకున్నాడు.

## పెళ్లి బృందం బస్సుకు ప్రమాదం ప్రయాణికులకు గాయాలు

**సంగారెడ్డి: పెన్ పవర్:**సంగారెడ్డి నుంచి హైదరాబాద్ వెళ్తున్న పెళ్లి బృందం బస్సు ప్రమాదానికి గురయింది. బ్రేక్ ఫెయిల్ కావడంతో ఇస్నాపూర్ వద్ద కల్వర్టును ఢీ కొట్టింది. ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న వారిలో ఐదుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. బస్సు డ్రైవర్ చాకచక్యంతో పెను ప్రమాదం తప్పింది. గాయాపడిన వారిని స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

## మోండా మార్కెట్ లో మేయర్ విజయలక్ష్మి పర్యటన

**సికింద్రాబాద్.. పెన్ పవర్:**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో ఆయా కార్పొరేషన్ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతినెల 300 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేస్తుందని హైదరాబాద్ నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి తెలిపారు. కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని మోండా మార్కెట్ డివిజన్ లో హనుమాన్ దేవాలయం వద్ద రహదారి పనుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్, కంటోన్మెంట్ శాసనసభ్యుడు శ్రీ గణేష్ లు పాల్గొన్నారు. కార్పొరేషన్ అభివృద్ధికి ఆయా కార్పొరేటర్లకు ప్రతి నెల 25 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసి కార్పొరేషన్ అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు. అదేవిధంగా కంటోన్మెంట్ ఏరియాలోని అన్ని వార్డుల అభివృద్ధికి తమ సహకారం కూడా ఉంటుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు వందల కోట్ల నిధులు వెచ్చిస్తుందని ఆమె తెలిపారు. నగరంలో ప్రజలకు మౌలిక వసతుల కల్పించడంతోపాటు సమస్యలు లేని విశ్వనగరంగా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తామని అన్నారు. పార్టీలకు అతీతంగా హైదరాబాద్ నగర అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## మల్కపేట రిజర్వాయర్, పంప్ హౌస్, కంట్రోల్ రూం తనిఖీ



**వేములవాడ, పెన్ పవర్:** మిడ్ మానేర్ నుంచి మల్కపేట రిజర్వాయర్ లోకి నీటి విడుదలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వెల్లడించారు. కోనరావుపేట మండలంలోని మల్కపేట రిజర్వాయర్, గేట్స్, అండర్ టన్నెల్, పంప్ హౌస్, మోటార్లు, కంట్రోల్ రూం, విద్యుత్ సరఫరా వ్యవస్థలను కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. మల్కపేట రిజర్వాయర్ లో ప్రస్తుతం నీటి నిల్వ ఎంత ఉంది అని జిల్లా నీటి పారుదల శాఖ అధికారి అమరేందర్ రెడ్డి ని ఆరా తీయగా, మంగళవారం 0.75 టీ ఎం సీ ల నీరు ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బోయినపల్లి మండలంలోని మిడ్ మానేర్ నుంచి ఈ రోజు 0.5 టీఎంసీల నీటి విడుదలకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ నీరు మల్కపేట రిజర్వాయర్ కు చేరుకోగానే.. దీని పరిధిలోని ఎల్లారెడ్డిపేట మండలంలోని మైసమ్మ చెరువు, సింగసముద్రం చెరువుకు నీటిని తరలిస్తామని వివరించారు. ప్రాజెక్ట్ పరిధిలో పంటలు వేసిన రైతులు సాగు నీరు విషయమై ఎలాంటి ఆందోళన చెందవద్దని సూచించారు. ప్రాజెక్ట్ లో నీటి నిలువలు ఉన్నాయని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. నీటి పారుదల శాఖ అధికారులు సైతం నిత్యం అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా ఉంటున్నారని కలెక్టర్ తెలిపారు.

## గాంధీ హాస్పిటల్లో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆకస్మిక పర్యటన

**హైదరాబాద్ పెన్ పవర్:** మంత్రి దామోదర రాజనర్సింహ మంగళవారం నాడు సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసారు. నేరుగా అవుట్ పేషెంట్ వార్డుకు వెళ్లి, ఓపీలో ఉన్న పేషెంట్లతో మాట్లాడారు. డాక్టర్ల అటెండెన్స్ షీట్ తెప్పించుకుని పరిశీలించారు. ముందస్తు సమాచారం లేకుండా డ్యూటీకి గైర్హాజరైన డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఓపీలో ఉండాల్సిన ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు అందుబాటులో లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసారు మంత్రి. షోకాజ్ నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలని సూపరింటెండెంట్, డీఎంఈని ఆదేశించారు. ఓపీ, ఐపీ, ఎంసీహెచ్, ఐవీఎఫ్, ఓపీ డయాగ్నస్టిక్ సర్వీసెస్, స్కానింగ్ వార్డులను పరిశీలించారు. ఐవీఎఫ్ సేవల్లో జాప్యంపై అసంతృప్తి వ్యక్తం చేసారు. సంబంధిత డాక్టర్లకు షోకాజ్ ఇవ్వాలని డీఎంఈకి ఆదేశించారు.

## డబ్బులతో ఎన్నికలు గెలిచారు

**హైదరాబాద్ పెన్ పవర్:**డబ్బులు దారపోస్తే కృష్ణ - గుంటూరు, గోదావరి జిల్లాల్లో గెలిచారని ప్రజా శాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు కేఏ పాల్ సంచ లన వ్యాఖ్యలు చేశారు.వంశీ,పోసాని కృష్ణ మురళి ఇద్దరు కేసులు ఎదుర్కోంటున్నారని,పవన్ కళ్యాణ్ అనుచిత వాఖ్యలపై కేసులు పెట్టరా అని ప్రశ్నించారు.109,144 ఐపీసీ ప్రకారం చట్ట విరుద్ధంగా ఎలక్షన్ హామీలు ఇచ్చారని,కొడాలి, రోజా, జగన్ లని త్వరలో అరెస్ట్ చేస్తారని అనుమానాలు వ్యక్తం చేశారు.తాను మీతో ఉంటే మిమ్మల్ని ఎవరు ఏమి చేయలేరని, నిరుద్యోగులు అంతా ప్రజా శాంతి పార్టీ కి సపోర్ట్ చెయాలని విజ్ఞప్తి చేశారు.యుద్దాలు పెంచుతున్నది నరేంద్ర మోడీ అని,కులాల మధ్య యుద్ధం మణిపూర్ లో యుద్ధం మోడీ చేయిస్తారని అన్నారు.

## ధాన్యం బకాయిలు రూ. 1,468.94 కోట్లను విడుదల చేయండి

**హైదరాబాద్ పెన్ పవర్:**2014-15 సంవత్సరానికి సంబంధించి సేకరించిన ధాన్యం బకాయిలు రూ. 1,468.94 కోట్లను విడుదల చేయాలని కేంద్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిసి విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన కింద సరఫరా చేసిన బియ్యానికి సంబంధించిన బకాయిలు రూ. 343.27 కోట్లు విడుదల చేయాలని,సీఎంఆర్ డెలివరి గడువును పొడిగించాలని కోరిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర మంత్రిని విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణ రేషన్ కోటా పెంచండి: కేంద్రానికి సీఎం విజ్ఞప్తి

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రేషన్ కోటా పెంచండి కేంద్రానికి సీఎం విజ్ఞప్తి తెలంగాణ కొత్త రేషన్ కార్డుల జారీ నేపథ్యంలో అవసరమైన కోటా పెంచాలని సీఎం రేవంత్ కేంద్రాన్ని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంత్రి ఉత్తమ్, సీఎం.. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషితో భేటీ అయ్యారు. 2014-15కి గాను సేకరించిన ధాన్యం బకాయిలు రూ.1,468.94 కోట్లు విడుదల చేయాలని కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేశారు. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన కింద సరఫరా చేసిన బియ్యం బకాయిలు రూ.343.27 కోట్లు విడుదల, సిఎంఆర్ డెలివరీ గడువును పొడిగించాలని కోరారు.

# స్వయం సహాయక సంఘాలకు బస్సులు

**హైదరాబాద్, మార్చి 4, పెన్ పవర్:** తెలంగాణ ప్రభుత్వం మరోసారి కీలక నిర్ణయం తీసుకుంది. స్వయం సహాయక సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులను కేటాయిస్తూ జీవో జారీ చేసింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున 150 బస్సులను మహిళా సంఘాలకు అందివ్వనున్నారు. ఈ కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు.మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సుల కేటాయింపుపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. స్వయం సహాయక సంఘాలకు బస్సులను కేటాయిస్తూ.. ఉత్తర్వులు జారీ చేసింది. తొలి విడతలో 150 మండల సమాఖ్యలకు బస్సులు కేటాయించనున్నారు. త్వరలో మిగిలిన 450 సమాఖ్యలకు ఆర్టీసీ అద్దె బస్సులు ఇవ్వనున్నారు. ఒక్కో బస్సుకు రూ.77,220 అద్దె చెల్లించనుంది తెలంగాణ ఆర్టీసీ.ఈ బస్సుల కొనుగోలుకు కూడా ప్రభుత్వమే బ్యాంకు గ్యారంటీ ఇవ్వనుంది. దేశంలోనే తొలిసారిగా స్వయం సహాయక సంఘాలకు అద్దె ఆర్టీసీ బస్సులు రానున్నాయి. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8న పరేడ్ గ్రౌండ్ వేదికగా 50 బస్సులను లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ పాల్గొననున్నారు.

మహిళలకు స్వయం ఉపాధి కల్పించి వారిని ఆర్థికంగా ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందితేనే సమాజం అభివృద్ధి చెందుతుందని తెలంగాణ ప్రభుత్వం విశ్వసిస్తుంది. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే స్వయం సహాయక సంఘాలకు అనేక పథకాలు, కార్యక్రమాల ద్వారా సహాయం అందిస్తుంది.బ్యాంకు లింకేజీ ద్వారా తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తుంది. నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ఉపాధి అవకాశాలు కల్పించడానికి సహాయపడుతుంది. మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తుంది. ప్రభుత్వం "మహిళా శక్తి" పేరుతో పలు రకాల కార్యక్రమాలను అమలు చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలోని 4.32 లక్షల సంఘాల కోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ తయారుచేశారు.గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన కోసం స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేశారు. స్వయం సహాయక సంఘాల్లో 10-15 మంది మహిళలు ఉంటారు. సభ్యులు క్రమం తప్పకుండా సమావేశమై, పొదుపు చేస్తారు. పొదుపు చేసిన మొత్తాన్ని సభ్యులకు అవసరమైనప్పుడు రుణంగా ఇస్తారు. ఇవే కాకుండా బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుంటారు. గ్రామంలో సంఘాలు అన్ని కలిపి వీవో (గ్రామ సమాఖ్య) కింద పనిచేస్తాయి. మండల స్థాయిలో.. మండల సమాఖ్య ఉంటుంది. జిల్లా స్థాయిలో.. జిల్లా సమాఖ్య ఉంటుంది.ప్రస్తుతం ప్రభుత్వం మండల సమాఖ్యలకు బస్సులు అందజేస్తోంది. తొలుత 150 మండలాలకు అందివ్వనున్నారు. వీటి పనితీరు, ఆదాయం పరిశీలన తర్వాత అన్ని మండలాలకు విస్తరింపజేసే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆర్టీసీలో ప్రైవేట్ బస్సులకు అద్దె చెల్లిస్తున్నారు. ఇప్పుడు మండల సమాఖ్యలకు ఇవ్వడం ద్వారా ఆ ఆదాయం మహిళలకు వెళ్లనుంది. మండల సమాఖ్యల అధ్యక్షురాళ్లు, కార్యదర్శులు, కోశాధికారులు వీటిని పర్యవేక్షించే అవకాశం ఉంది.

# ఆర్ ఎస్ ప్రవీణ్ , సునీల్ కుమార్ పై సోషల్ మీడియాలో సెటైర్లు

**హైదరాబాద్, మార్చి 4, పెన్ పవర్:**మళ్లీ కోడుగుడ్డు దగ్గరకు వద్దాం.. పాత తెలుగు నుడికారం గురించి చెప్పడం కాదు.. ఎక్కడిది ఈ మాట అంటే మాజీ ఐపీఎస్ అధికారి, ప్రస్తుత తెలంగాణ రాజకీయ నేత, బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఆంధ్రా డీజీ పీవీ సునీల్ కుమార్ కుమార్ సస్పెన్షన్ విషయంలో చేసిన వ్యాఖ్యలివి. సునీల్ కుమార్ కు మద్దతుగా ఆయన మాట్లాడటం ఇదే మొదటి సారి కాదు. ఇంతకు ముందు కూడా సపోర్ట్ చేశారు. ఒకప్పటి తన సీనియర్ కు మద్దతుగా ప్రవీణ్ కుమార్ మాట్లాడటం తప్పు కాదు. ఆయన పాయింట్ ఆయన చెప్పొచ్చు. అయితే... ఆర్ఎస్పీ వ్యాఖ్యలు ఇంకో చర్చకు దారితీశాయి. తీవ్ర ఆరోపణలు ఉన్న వ్యక్తికి సపోర్ట్ చేయడం, ఐపీఎస్ సర్వీసు రూల్స్ ను అతిక్రమించినా సపోర్ట్ చేయడంతో పాటు.. పక్క రాష్ట్ర వ్యవహారాల్లో వేరే పార్టీ రాజకీయ నాయకులు జోక్యం అవసరమా అనే వరకూ వ్యాఖ్యానాలు, దళిత్ విక్టిమ్ కార్డు, కులాన్ని ఇమ్యూనిటీగా వాడుకుంటున్నారనే వరకూ వ్యాఖ్యానాలు వెళ్లాయి. ( ఎందుకంటే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కేవలం మాజీ ఐపీఎస్ కాదు.. బీఆర్ఎస్ లో ముఖ్యనేత ) జస్ట్ జరుగుతున్న విషయాన్ని అనలైజ్ చేద్దాం.. ఆయన వ్యాఖ్యలు కరెక్టో కాదో మీరే కామెంట్లో చెప్పండి సీనియర్ ఐపీఎస్ అధికారి, సీఐడీ మాజీ చీఫ్ సునీల్ కుమార్ ను కూటమి ప్రభుత్వం సస్పెండ్ చేయడం మొత్తం వివాదానికి కారణం. అయితే సునీల్ కుమార్ పై ఈ ప్రభుత్వం కోపం ఇప్పటిది కాదు. కిందటి జగన్ ప్రభుత్వంలో సునీల్ కుమార్ తన పరిధి దాటి వ్యవహరించారని టీడీపీ నేతలు అప్పట్లో బహిరంగంగా ఆరోపించారు. ఆయన నేతృత్వంలోని సీఐడీ దాదాపుగా జగన్ కు ప్రైవేట్ ఆర్మీ లాగా మారిపోయిందని అనేక సార్లు అనేక మంది నేతలు ఆరోపించారు. అప్పట్లో జరిగిన అరెస్టులు, ఎంపీ రఘురామకృష్ణ రాజును కస్టోడియల్ టార్చర్ చేశారనే ఆరోపణలతో ఆయన వివాదాస్పదుడిగా ముద్ర పడ్డారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక విషయాలపై ఐపీఎస్ సునీల్ కుమార్ కు ప్రభుత్వం మెమోలు ఇచ్చింది. అప్పుడు కూడా ఆర్ఎస్పీ సునీల్ కుమార్ కు మద్దతిచ్చారు. ఇక ఇప్పుడు సస్పెన్షన్ కు దారి తీసిన పరిస్థితి ఏంటంటే అయితే 2019 -24మధ్య సునీల్ కుమార్ ఆరుసార్లు విదేశీ పర్యటన చేశారు. ఇందులో మూడుసార్లు ప్రభుత్వ అనుమతి తీసుకున్నారు. కానీ చెప్పిన చోటకు




కాకుండా వేరే దేశానికి వెళ్లారు. జార్జియా వెళుతున్నా అని అబుదాబికి, అమెరికా వెళుతున్నా అని యు.కె కు వెళ్లారు. మరో మూడుసార్లు ఎలాంటి అనుమతి తీసుకోకుండానే యూఏఈ, యూఎస్ , స్వీడన్ దేశాలకు వెళ్లొచ్చారు. ఇదే కారణంతో ఆయనను సస్పెండ్ చేశారు. ఇది కాకుండా వేరే ఆరోపణలు, కేసులు కూడా ఉన్నాయి. అయితే ఆర్ఎస్పీ ఈ సస్పెన్షన్ వచ్చిన వెంటనే ఓ పెద్ద ట్వీట్ చేశారు.దీనిపైనే టీడీపీ శ్రేణులు భగ్గుమంటున్నాయి. ప్రవీణ్ కుమార్ ఓ రాజకీయ నేత కాబట్టి దీనిని రాజకీయ ఆరోపణగానూ.. టీడీపీ వాళ్ల రెస్పాన్స్ ఓ రిటార్ట్ లానూ చూసుకున్నా.. ప్రవీణ్ కుమార్ మాట్లాడిన వాటిలో చాలా విషయాలున్నాయి వాటిపైన కూడా చర్చ జరుగుతోంది.పీవీ సునీల్ సస్పెన్షన్ ను ఆయన ఖండించారు. అంతవరకూ ఆయన అభిప్రాయం ఓకే. ఆ తర్వాత విదేశాలకు వెళ్లారని సస్పెండ్ చేయడం కోడిగుడ్డు మీద ఈకలు పీకడమే.. అట్టర్ నాన్సెన్స్ అంటూ కూడా రాశారు. ఇదే పాయింట్ ఆఫ్ డిస్కషన్. ఆలిండియా సర్వీసు నిబంధనల ప్రకారం.. ఏమో అధికారులు విదేశీ పర్యటనలు చేస్తే కచ్చితంగా ఆ విషయాన్ని ప్రభుత్వానికి చెప్పాలి. ఇది జూనియర్లు కూడా పాటిస్తారు. మరి అంతటి సీనియర్లు అయిన సునీల్, ప్రవీణ్ కుమార్ కు ఆ విషయం తెలీకుండా ఉండదు. ఒకవేళ తెలిసినా సునీల్ కుమార్ ఒక్కరే కాదు.. దాదాపు చాలా మంది ఐఏఎస్, ఐపీఎస్ లు ఇలా చేస్తున్నారు ఇది పట్టించుకోవలసిన విషయం కాదు అన్నది ఆర్ఎస్పీ ఉద్దేశ్యం ఏమో.. అయితే ఇక్కడ ఇంకో ప్రశ్న ఉంది. ఆయన చెప్పకుండా విదేశాలకు వెళ్లినా కూడా జస్ట్ వయలేషన్ అనుకోవచ్చు. మరి ఒక దేశం అని చెప్పి మరో దేశం పోవలసిన అవసరం ఏమొచ్చింది. అలా మూడుసార్లు అబద్దాలు ఎందుకు చెప్పారు...? ప్రభుత్వ జీవో ప్రకారం అయితే అంతే ఉంది. అది కాదు అంటే సునీల్ కుమార్ కానీ... లేదా ఆయన్ను సపోర్టు చేస్తున్న ప్రవీణ్ కుమార్ కానీ సమాధానం చెప్పాలి. వాళ్లింకా చెప్పలేదు. ఇక రెండో విషయం డిప్లమోటిక్ పాస్ పోర్ట్. జనరల్ గా అది కేంద్రమంత్రులు, ముఖ్యమంత్రులు, ఇతర రాజ్యాంగ హోదాల్లో ఉన్న వారికి ఉంటుంది. అది లేదు అని చెప్పడం వెనుక ఉద్దేశ్యం కేవలం ఆక్రోశం మాత్రమేనా లేక అలా ఉండాలని కోరుకుంటున్నారా.. దావోస్ కు తండ్రీ- కొడుకులు ప్రభుత్వ డబ్బుతో వెళ్లారు.. ఆయన సొంత డబ్బులతో వెళ్లాడు అని చెప్పడం ద్వారా ప్రవీణ్ కుమార్ దీనిని పూర్తిగా పొలిటికల్ విషయంగా మార్చారు. నిజంగా సర్వీసు రూల్స్ కు సంబంధించి తన మాజీ సీనియర్ కు సపోర్టు చేయాలనుకుంటే అక్కడికే పరిమితం అయి ఉండేది. దావోస్ అనేది అధికార పర్యటన. అంటే చంద్రబాబు- లోకేష్ అయినా రేవంత్ రెడ్డి లేదా అంతకు ముందు కేటీఆర్, జగన్ అయినా ప్రభుత్వ నిధులతోనే కదా వెళతారు. మరి ఈ కామెంట్ కు అర్థం ఏంటి ఎస్సీ ఎస్టీలు... విమానాలు ఎక్కొద్దా.. ? నేను మొదట్లో వీడియో చేయొద్దనుకోవడానికి కారణం ఈ పాయింటే. ఈ సెన్సిబుల్ ఇష్యూను.. స్పిన్ చేస్తుండటం. ఎంతో అనుభవం, పరిణితి, ప్రజ్ఞ ఉన్న ప్రవీణ్ కుమార్ సగటు రాజకీయ నాయకులులాగా ఇక్కడ ఈ అస్త్రాన్ని ప్రయోగించారు. ఇంతకు ముందు కూడా ఇలాగే అన్నారు. దీనిపైన టీడీపీ వాళ్లు చేస్తున్నటు వంటి కౌంటర్లు ఏంటంటే.. కిందటి ప్రభుత్వంలో దళిత డాక్టర్ ను రోడ్డుపైన అవమానించినప్పుడు.. ఓ ఎమ్మెల్సీ దళిత డ్రైవర్ ను డోర్ డెలివరీ చేసినప్పుడు... ఓ దళిత యువకుడుని పోలీసులు కొట్టి చంపారని ఆరోపణలు వచ్చినప్పుడు.. ఇంకో దళిత యువకుడిపై యూరిన్ పోసి శిరోముండనం చేసినప్పుడు ఎందుకు మాట్లాడ లేదు అని.. సామాన్య దళితుల పట్ల సానుభూతి చూపాల్సిన ఆర్ఎస్పీ తీవ్రమైన ఆరోపణలున్న ఓ సీనియర్ అధికారికి ఎందుకు వంత పాడుతున్నాడు అని వాళ్లు ప్రశ్నిస్తున్నారు..